క్లుప్తంగా

కండ్ల కలకపై అప్రమత్తం



విద్యార్థినులను పరీక్షిస్తున్న జగన్

చింతపల్లిరూరల్: కండ్ల కలకపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని దృష్టి ఐ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ గాలి జగన్ అన్నారు. కండ్ల కలక సోకిన ఐదుగురు విద్యార్థినులకు మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గల దృష్టి ఐ కేర్‌లో పరీక్షించి, మందులు ఇచ్చారు. పాటించాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణం కారణంగా కండ్లకలకలు వ్యాపిస్తాయని చెప్పారు. చేతులు,కళ్లు తరుచూ శుభ్రపరుచుకుంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కంటి వ్యాపు,దురద,నొప్పి ఉన్నట్టయితే వెంటనే దగ్గరలో ఉన్న ఆస్పత్రులకు వెళ్లాలని ఆయన సూచించారు.

మంప అదనపు ఎస్‌ఐ దేముడు బదిలీ



కొయ్యూరు: మంప అదనపు ఎస్‌ఐ బొడ్డు దేముడును మన్యం పార్వతీపురం జిల్లాకు బదిలీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేముడును మన్యం జిల్లా నుంచి మంప స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎన్నికలు ముగియడంతో తిరిగి పాత స్థానానికి పంపారు.

నిత్యావసర సరకుల పంపిణీ



కోడిపుంజువలసలో నిత్యావసర సరకులు అందజేస్తున్న కృష్ణకుమారి

అరకులోయ రూరల్: నిరుపేదలకు సేవ చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందని మానవ హక్కుల నేర నిరోధక మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కృష్ణకుమారి అన్నారు. మండలంలోని శిర్గం పంచాయతీ కోడిపుంజువలసలో మంగళవారం నిరుపేద మహిళలకు నిత్యావసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

తెరిపిచ్చిన వాన

రాజవొమ్మంగి : మండలంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. మంగళవారం వర్షాలు తెరిపివ్వడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమయ్యారు. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం అయి ఉండగా, సాయంత్రం 4 గంటలకు ఒక్కసారిగా మబ్బులు వీడి సూర్యుడు కనిపించాడు. మహిళలు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించారు.

27న జెడ్పీ సర్వ సభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 27న ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని సీఈవో ఎం.పోలినాయుడు కోరారు. అన్ని శాఖ ల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న యువకులు

రాజవొమ్మంగి : శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని కోరుతూ మండలంలోని జడ్డంగి చైతన్యనగర్ గ్రామస్తులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. మడేరు వాగు ఆవలవైపు గల శ్మశానవాటికకు వర్షాకాలంలో వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడుతున్నామని వారు ఈ సందర్భంగా తెలిపారు. అధికారులు స్పందించి అనువైన స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాణాలు పణంగా... ప్రయాణం



కుడియా గ్రామ సమీపంలోని గెడ్డను ఆటోతో దాటుతున్న గిరిజనులు (ఫైల్)

- గెడ్డలు దాటాలంటే గండమే
- సాహసం చేస్తే తప్ప గ్రామాలకు చేరుకోలేని పరిస్థితి
- వంతెనలు నిర్మించాలని వినతి

అనంతగిరి: మండలంలో గెడ్డల అవతల ఉండే గ్రామాలకు చేరుకోవాంటే సాహసం చేయాల్సిందే. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఏ మాత్రం వర్షం పడినా గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తాయి. వాటిని దాటితే తప్ప మండలంలో చాలా గ్రామాలకు చేరుకునే పరిస్థితి లేదు. అత్యవసర పరిస్థితిలో వరద ఉధృతిని సైతం చూడకుండా గెడ్డలను దాటుతూ పలువురు ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారు. నేటికీ పలు గెడ్డలపై వంతెనలు నిర్మించకపోవడంతో ఆయా గ్రామాల గిరిజనులు నిత్యం ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణాలు చేయవలసి వస్తోంది. వంతెనలు నిర్మించవలసిన స్థానంలో పలు చోట్ల కాజ్‌వేలు నిర్మించారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా కాజ్‌వేలపై నుంచి నీరు ఉధృతంగా ప్రవస్తుండడంతో వాటిని దాటేందుకు గిరిజనులు పెద్ద సాహసమే చేయవలసి వస్తోంది. గత ఏడాది డిసెంబర్‌లో భీంపోల్ పంచాయతీ సమీపంలో లువ్వా కాజ్‌వే పై నుంచి కొంతమంది గిరిజనులు గెడ్డను దాటుతుండగా ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. దీంతో సీతపాడు గ్రామానికి చెందిన గెమ్మెల లక్ష్మి, గెమ్మెల కుమార్, మిరియాల కమల అనే ముగ్గురు గెడ్డలో గల్లంతై మృత్యువాతపడ్డారు. వరద నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్న సమయంలో గెడ్డలను దాటే సాహసం చేయవద్దని, చేపలవేటకు వెళ్లవద్దని అధికారులు పలు



గెడ్డను దాటుతున్న గిరిజనులు (ఫైల్)

సూచనలను చేస్తున్నా ఇటువంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

వంతెనలు నిర్మించాల్సిన ప్రాంతాలు

మండలంలో భీంపోల్ పంచాయతీ లువ్వా కాజ్‌వే వద్ద, పెదకోట-కుడియా రోడ్డులో గెడ్డపై , రామచంద్రపురం గెడ్డపై, ఓనుకొండ సమీపంలోని గెడ్డపై ప్రధానంగా వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

గెడ్డలపై వంతెనలు నిర్మించాలి



పినకోట-కుడియా రోడ్డులో గెడ్డపై వంతెన లేకపోవడంతో వర్షకాలంలో కివర్ల పంచాయతీలో పలు గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోతున్నాయి. తముటు గెడ్డపై వంతెన నిర్మించాల్సి ఉంది. వంతెనలు నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా స్పందించి వంతెలను నిర్మించాలి.

– సిరగం గణేష్, సర్పంచ్, పినకోట

ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు



భారీగా కురుస్తున్న వర్షాలు కారణంగా గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ సమయంలో గెడ్డలను దాటేందుకు యత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. గెడ్డలు ఉధృతి తగ్గిన తరువాత గ్రామాలకు చేరుకోవాలి.

– కరక రాము, ఎస్‌ఐ, అనంతగిరి

ప్రమాదకరంగా చొంపి వంతెన



చొంపి వంతెన

అరకులోయ రూరల్: మండల కేంద్రానికి సమీపంలో గల చొంపి గెడ్డపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వంతెనకు ఇరువైపుల రంధ్రాలు ఏర్పడ్డాయి. ఇదే ప్రధాన మార్గం కావడంతో నిత్యం చొంపి,శిర్గం,బస్కీతో పాటు పలు పంచాయతీల నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన పూర్తిగా పాడైపోవడంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు, వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వంతెనకు మరమ్మతులు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరారు.

నాలుగు ఆధార్ కేంద్రాల ఏర్పాటు

పాడేరు : మండలంలో నాలుగు గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సాయినవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. చింతలవీధి, మినుములూరు, పాడేరు-3, వంతాడపల్లి గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ ఆధార్ కేంద్రాలు పని చేస్తాయన్నారు. ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవడం, పేర్లు, పుట్టిన తేదీలు, చిరునామా తదితర సవరణలు చేసుకోవచ్చని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మారేడుమిల్లి : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో వీర కిషోర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధ, గురువారాలు దారవాడ, శుక్ర, శనివారాలు మారేడుమిల్లిలో ఆధార్ క్యాంప్‌లను ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కొత్త ఆధార్ నమోదు, అప్‌టు డేట్, ఇంటి అడ్రస్, వయస్సు తదితర మార్పులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ముంచంగిపుట్టు: గ్రామ సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ కించాయిపుట్టు, కిలగాడ,మాకవరం, వనుగుమ్మ గ్రామ సచివాలయాల్లో ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆధార్‌లో మార్పులు,చేర్పులు,నూతన ఆధార్‌నమోదు చేసుకోవచ్చని,కేటాయించిన గ్రామాల వారీగా ప్రజలు ఆధార్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాని తెలిపారు.

కొట్టుకుపోయిన చుట్టగొంది కల్వర్టు

ముంచంగిపుట్టు: మండలంలోని బుంగాపుట్టు నుంచి చుట్టుగొంది వెళ్లే మార్గంలో వరద ప్రవాహ ఉధృతికి కల్వర్టు కొట్టుకుపోయింది. కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు కల్వర్టుపై నుంచి వరదనీరు ప్రవహించడంతో రెండు వైపులా కోతకు గురైంది. మంగళవారం ప్రవాహ ఉధృతికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో చుట్టుగొంది, కోడాగూడ, మలుగురాయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 235 కుటుంబాలకు చెందిన 387 మంది గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు


జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి నరసింహులు



జీవానికి టీకా వేయిస్తున్న నరసింహులు

చింతూరు:ముంపు ప్రాంతాల్లో వరద తగ్గిన అనంతరం పశువులకు ముద్ద చర్మవ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి నరసింహులు సూచించారు. మంగళవారం ఆయన చింతూరు డివిజన్లోని ముంపు ప్రాంతాలను పరిశీలించి పాడి రైతులతో మాట్లాడారు. వరదలు తగ్గిన అనంతరం ప్రభావిత ప్రాంతాల్లో పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

సీసీఆర్‌సీ కార్డులతో పంటపై సర్వహక్కులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో అప్పారావు

నర్సీపట్నం: సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు పంటపై సర్వహక్కులు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారి డి.అప్పారావు పేర్కొన్నారు. మంగళవారం గబ్బాడ గ్రామ సచివాలయంలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూయజమానికి నష్టం కలగకుండా కౌలుదారునికి అనేక లాభాలు కల్పించే సీసీఆర్‌సీ కార్డులను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్డులతో రాయితీపై అందించే ఎరువులు, విత్తనాలు ఇతర పథకాలు పొందవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్ట పరిహారం, పంట రుణాలు, పంట అమ్మకం, సాగుదారుని పేరు మీద చేసుకోవచ్చన్నారు. కార్డు కాలపరిమితి 11 నెలలు ఉంటుందన్నారు. సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ ఈ కార్డుల వల్ల భూయజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. భూమిపై సర్వహక్కులు భూ యజమానికి చెందుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రాజునాయుడు, మాజీ ఎంపీటీసీ ఈర్ల రాజుబాబు, రైతులు, కౌలుదారులు, వీఆర్వో సింహాచలం, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయంతో అవస్థలు

పెదబయలు: స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో సోమవారం అర్ధరాత్రి వైర్లపై వెదురు కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో తీవ్ర అవస్థలకు గురైనట్టు స్థానికులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం వరకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదని వారు చెప్పారు. పెదబయలు సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఏఈ సెలవులో ఉండడం, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్ పాడేరు నుంచి వచ్చి విధులు నిర్వహించడం వల్ల రాత్రి సమయాల్లో అంతరాయం ఏర్పడితే త్వరితగతిన పునరుద్ధరించే అవకాశం లేకుండా పోయిందని వారు చెప్పారు. గోమంగి లైన్‌లో గత నెల రోజుల్లో చాలాసార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేదని గ్రామస్తులు చెప్పారు. గతంలో సరఫరాలో అంతరాయం ఏర్పడిన గంటల వ్యవధిలోనే మరమ్మతులు చేసి, సరఫరా పునరుద్ధరించేవారని, సిబ్బంది సకాలంలో స్పందించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గోమంగి,గుల్లేలు,లింగేటి, బొంగరం పంచాయతీల వినియోగదారులు తెలిపారు.

అంగన్‌వాడీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ముంచంగిపుట్టు: వర్షాలు జోరుగా పడుతున్నందున అంగన్‌వాడీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీడీపీవో వరహాలమ్మ తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, కారిపోతున్న భవనాల్లో కేంద్రాలను నిర్వహించవద్దని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కేంద్రాన్ని నిర్వహించాలని తెలిపారు. గర్భిణులు,బాలింతలు,చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు.

చేపల వేటకు వెళ్లొద్దు



గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

సీలేరు: ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపలవేటకు వెళ్లవద్దని సీలేరు ఎస్‌ఐ జె.రామకృష్ణ తెలిపారు. సీలేరు నది పరిసరాల్లో ఉన్న పార్వతీనగర్, బూసుకొండ, వలసగెడ్డ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఎస్‌ఐ పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నానిగోడల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

జిల్లాలో 604.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

సాక్షి,పాడేరు: జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి.చింతూరు,రంపచోడవరం డివిజన్ల పరిధిలో తేలికపాటి వర్షాలు కురుస్తుండగా, పాడేరు డివిజన్‌లో మాత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి.జిల్లా వ్యాప్తంగా మంగళవారం 604.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.అత్యధికంగా ముంచంగిపుట్టులో 158.2,పెదబయలులో 44.8,అనంతగిరిలో 42.4,డుంబ్రిగుడలో 35.6,అరకులోయ 30.2,మారేడుమిల్లి 24,జి.కే.వీధి 14.2,దేవిపట్నం 13.2,వై.రామవరం 12.6,రంపచోడవరం 12.6,పాడేరు 11.4,హుకుంపేట 11,వి.ఆర్.పురం 10.4ఏటపాక 10.2,అడ్డతీగల 9.4,కూనవరం 9.2,గంగవరం 8.2,రాజవొమ్మంగి 6.8,చింతూరు 6,చింతపల్లి 5.2,కొయ్యూరు 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నెలకొంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు పట్టణంలోని తలారిసింగి గౌతమి పాఠశాల సమీపంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో విద్యుత్ లైన్‌పై చెట్టు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.ఈదురుగాలుల తీవ్రతతో చెట్టు కూలింది.రాత్రి 9గంటల వరకు పట్టణంలోని పలు వీధుల్లో అంధకారం నెలకొంది.విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు,సిబ్బంది కూలిన చెట్టు కొమ్మలు తొలగించేందుకు ఎంతో శ్రమించారు.రాత్రి పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

గుర్రగరువులో జ్వరాల విజృంభణ

- ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు సూచనతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు
- 40 మందికి వైద్య సేవలు



గుర్రగరువులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాడేరు: మండలంలోని మోదాపల్లి పంచాయతీ గుర్రగరువులో జ్వరాలు విజృంభించాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామంలో తక్షణమే వైద్య శిబిరం నిర్వహించాలని సూచించారు. దీంతో ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నర్సింహారావు తన సిబ్బందితో కలిసి గ్రామంలో పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మలేరియా నిర్ధారణ పరీక్షలు జరిపారు. అందరికి మలేరియా నెగిటివ్‌గా నిర్ధారించారు, ఆరుగురు సాధారణ జ్వరాలతో బాధపడుతుండంతో వారికి వైద్య సేవలు, మందులు అందజేశారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించారు. వాతావరణ మార్పుల కారణంగా చర్మ వ్యాధులు, జలుబుతో బాధపడుతున్నారని వైద్యాధికారి తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వినియోగించాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. గ్రామంలో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ ఎస్.వరహాలనాయుడు, హెచ్‌వీ కొండమ్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ధనుంజయ్, ఏఎంవో సోముదొర, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి



పనసలపాడులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు,వ్యవసాయ శాఖ అధికారులు

చింతపల్లిరూరల్: జోరుగా కురుస్తున్న వర్షాల కారణంగా పొలాల్లోకి చేరిన నీటిని బయటకు పంపేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపురెడ్డి, డాక్టర్ పి.బాలహుస్సేన్ రెడ్డి సూచించారు. మండలంలో పనసలపాడు, కొటకొండ, చదలపాడు తదితర గ్రామాల్లో చింతపల్లి వ్యవసాయాధికారి శ్రీనివాస్‌తో కలిసి పర్యటించి, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తగినంత తేమ ఉన్న సమయంలో కలుపును నివారించుకోవాలని సూచించారు. వరి నారుమడిలో కిలో యూరియా, కిలో పొటాష్ కలిపి జల్లుకోవాలని తెలిపారు. నారు నాటిన 15 రోజుల నుంచి చిరు పొట్ట దశ వరకు పొలంలో నీటిని పలుచగా పెట్టడం ద్వారా ఎక్కువగా పిలకలు వచ్చి అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. వేరుశనగా పంటలో తిక్క ఆకు మచ్చ తెగులు వ్యాపిస్తే దాని నివారణకు ఒక లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండిజం లేదా, 2.5 గ్రాము మ్యాంకోజబ్ చొప్పున కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ గ్రామ సహాయక వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ముంచంగిపుట్టు: మండలంలో కించాయిపుట్టు,కర్రిముఖిపుట్టు పంచాయతీల్లో వర్షాలకు నీట మునిగిన మొక్కజొన్న పంటను మంగళవారం వ్యవసాయశాఖాధికారులు,వ్యవసాయ శాస్త్రవేతలు పరిశీలించారు.పంటల పరిస్థితులను గిరిజన రైతులకు అడిగి తెలుసుకున్నారు.రైతులకు పలు సూచనలు చేశారు.తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసబాబు మాట్లాడుతూ మండలంలో పంటల నష్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, రైతులను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. 25 గ్రామాల్లో 280 హెక్టర్లలో మొక్కజొన్న పంటకు నష్టం జరిగినట్టు గుర్తించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేతలు డాక్టర్ ప్రదీప్,డాక్టర్ తేజేశ్వరరావు,రైతు సేవ కేంద్రం వ్యవసాయ సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

భీతిగొల్పుతున్న పట్టు పరిశ్రమ క్వార్టర్లు



శిథిలావస్థకు చేరిన ఇళ్లు

అరకులోయ రూరల్: పట్టు పరిశ్రమకు చెందిన స్థానికంగా ఉన్న ఐదు క్వార్టర్లు ప్రమాదకరంగా భీతిగొల్పే స్థితిలో ఉన్నాయి. గత కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఇవి మరింత అధ్వానంగా మారాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో వీటిని ప్రైవేట్ వ్యక్తులు వినియోగిస్తున్నారు. క్వార్టర్ల గోడలకు పెద్ద పెద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. సన్‌షేడ్స్,గోడలు విరిగి పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో పాముల బెడద ఎక్కువగా ఉంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేసి, పరిసరాలు పరిశుభ్రం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత ఏవో సన్యాసిరావును వివరణ కోరగా ఈ నివాసాలు ఐటీడీఏ పరిధిలో ఉన్నాయని, వారే మరమ్మతులు చేయించాలని తెలిపారు.

తారురోడ్డు కోసం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బొరిబొరివలస గ్రామస్తులు

అనంతగిరి: తారు రోడ్డు కోసం టోకూరు పంచాయతీ బొరిబొరివలస గ్రామ గిరిజనులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పీవీటీజీ గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ మా గ్రామానికి మేలు జరగడం లేదని వారు తెలిపారు. వర్షాల కారణంగా గ్రామానికి వెళ్లేమట్టిరోడ్డు అస్తవ్యస్తంగా మారిందని, ఎక్కడికక్కడ కోతకు గురికావడంతో అత్యవసర సమయంలో గ్రామానికి వాహనాలు వచ్చేపరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. కాలినడకనే అనారోగ్య బాధితులను ఆస్పత్రికి తీసుకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని, అధికారులు స్పందించి తారురోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో ప్రసాద్

గొలుగొండ: కుష్టు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి సోకితే ఆందోళన చెందవద్దని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాకలపాడులో ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ప్రాథమికంగా ఒకరికి గ్రామంలో కుష్టు లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని సీహెచ్‌వో ప్రసాద్ తెలిపారు. అవసరమైన మందులు అందించి వ్యాధి నిర్మూలకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.